# దీపావళి సిసింద్రీలు మెనీ మినీ కథలు

మా ఆవిడ పుట్టింటికి వెళ్ళిన శుభ సందర్భంలో నేను గరిట పుచ్చుకోవాల్సివచ్చింది.

## లాటరీ



### చెల్లూరి సీతారాజేశ్వరరావు

అలవాటు తక్కువమీద కూర, చారు వండేసరికి రెండు గంటలు పట్టింది. స్కూల్ టైం అయిపోయింది. హడావిడిగా భోజనం చేసి తాళం వేస్తూండగా, ఎదురుగా వున్న బ్రహ్మశర్మ అరుగుమీద జనం కనిపించారు. ఏమిటో తెలుసుకోవాలని అక్కడికి వెళ్ళాను.

బ్రహ్మశర్మకి రెండు వేలు లాటరీ తగిలింది. ఏజెంటు అభినందిస్తున్నాడు.

"అదృష్టవంతుడివయ్యా శర్మా" అన్నాను పైకి నవ్వుతూ.

"ఆ రోజు నర్సాపురం బస్‌స్టాండ్‌లో టికెట్ కొనమంటే ఈయన ఎంత బెట్టు చేశాడు. బలవంతంగా కొనిపించాను" ఏజెంటు గర్వంగా చెబుతున్నాడు.

నేను కూడా చాలా సార్లు లాటరీ టిక్కెట్లు కొన్నాను. ఎప్పుడూ పది రూపాయల ప్రయిజు కూడా దొరకలేదు. అదృష్టం వుండాలేమో.

"శర్మగారే అదృష్టవంతుడని మీరంతా విచారించవల్సిన పనిలేదు, ఆ అదృష్టవంతులు మీలోనూ వున్నారు. మీరు చేయవల్సిందల్లా అవకాశం యివ్వడం." ఏజెంటు బాగ్‌లోనుంచి టిక్కెట్లు తీశాడు

బ్రహ్మ శర్మకి తగిలిందన్న అసూయ వల్ల అక్కడున్న చాలా మంది టిక్కెట్లు కొన్నారు. నెలాఖరి రోజులయినా నేనూ ఒక టికెట్ కొన్నాను.

"శర్మగారూ టికెట్ తీసుకుని శుక్రవారం రండి. మీకు డబ్బు యిప్పిస్తాను." ఏజెంటు చెప్పి వెళ్ళిపోయాడు.

నెల రోజులు గడిచాయి.

అందరితోపాటు నేనూ లాటరీ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాను. ధనలక్ష్మి ఎప్పుడు ఎలా వచ్చి తలుపు తడుతుందో!

ఓ సాయంత్రం నేను స్కూలునుంచి వస్తూండగా, మొన్న వచ్చిన లాటరీ ఏజెంటు ఎదురయ్యాడు.

"నాకేమయినా తగిలిందా?" ఆశగా అడిగాను.

"శర్మగారికే తగిలిందండీ. అయిదు వేలు" అన్నాడు ఏజెంటు.

మాది పల్లెటూరేమో క్షణాల మీద ఆ వార్త అంతటా వ్యాపించింది. అందరి కళ్ళు శర్మ యింటికేసే.

"అదృష్టం నిన్ను తరుముకొస్తుందయ్యా. నీ వరుస చూస్తుంటే గ్రామాన్నే కొనేలావున్నావు." లోపల ఏడుస్తూ పొగిడాను.

"ఒక టిక్కెట్టయితే తగలకపోవచ్చని పాతిక టిక్కెట్లు కొన్నాను. ఓదానికి తగిలింది." శర్మ చెప్పాడు.

ఈసారి ఏజెంటుని ఎవరింటికి వారే రప్పించుకుని, గణితాలు అదృష్టసంఖ్యలు, జ్యోతిష్యాలు కూడుకుని ఒక్కొక్కరూ పాతికనుంచి వంద టిక్కెట్లు కొన్నారు. జీతాలు వచ్చినరోజు కాబట్టి నేను కూడా ముప్పయి టిక్కెట్లు కొన్నాను. ఏందరూపాయిలు తగిలినా చాలు.

## కదలిక

పేరుకుపోయిన చీకటివాళ
పేరుకు—పోయినట్లే ఉంటుంది
పసుపురాసి పండుగనీ
తోరణం కట్టి వేడుకనీ
చైతన్యం లేని శరీరాలకు
కొత్తబట్టలు కప్పి
తల వాకిట దీపాలు పెట్టి
వేదనను వాయిదా వేస్తే
ఆకలిని అణచుకో జూస్తే
రేపు ఇంతకింతా తప్పుతుందా?
ఆడది అసురుణ్ణి చంపిందని
పురాణం చెప్పుకు మురుస్తావేతప్ప
నీలో "కదలిక" రాదు
నిన్ను నువ్వే నిర్లక్ష్యం చేసుకున్నా
స్వర్గాన్ని తెచ్చి భూమ్మీద పరుస్తార
నీ కోసం!
ఎవరో?

—ఓంకార్



పది రోజుల్లో ఫలితాలు వచ్చాయి. మా కెవరికీ ఏ ప్రయిజూ రాలేదు. శర్మకి వెయ్యి రూపాయల ప్రయిజ్ తగిలింది.

ఇంతలో నాకు ట్రాన్స్ఫర్ వచ్చింది. సామాను లారీమీద పంపేసి బస్స్టాండుకి నడుస్తూండగా బ్రహ్మశర్మ ఎదురయ్యాడు.

"ఈసారి మీ చేతులతో కొనివ్వండి ఓ టికెట్ శర్మా "

"ట్రాన్స్ఫర్ అయిందిగా నీకు వస్తుంది ప్రయిజు-ఏజెంటుతో నేను చెబుతాను " అన్నాడు శర్మ.

"ప్రయిజు రావడానికి ఏజెంటు యిష్టమా?"

బ్రహ్మశర్మ జ్ఞానోపదేశం చేశాడు నేను విస్తుపోయాను. బస్‌లో పయనిస్తూ కూడా నేనింకా కోలుకోలేదు.

ఏనాడు బ్రహ్మశర్మకి ఏ ప్రయిజు తగల్లేదు. ఏజెంటు లాటరీ టిక్కెట్టు అమ్ముకోడానికి అలా పథకం వేశాడు. తనకివుపయోగపడినందుకు బ్రహ్మశర్మకి కమీషన్ యిస్తాడు.

ఒక్కొక్క వూరిలో అయిదారుసార్లు మాత్రమే సాగుతుంది. మళ్ళా కొత్త వూరుని. కొత్త పార్టీని చూసుకోవాలి.

ఇదా లాటరీ లాభం?.........కాదు కాదు నష్టం. ●




# అ... అమ్మ ఆ... ఆకలి!



## రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి ఎ. బి.

మధ్యాహ్నం మూడున్నర. కడుపులో కరకర. ఉదయం బాగా తొందరగా భోంచేశా మరి. ఇంటికి దగ్గర్లో హోటల్సు కూడా ఏమీ లేవు. అయినా బయట ఎండమండిపోతోంది లాభంలేదు.

ఇంట్లో పొద్దుటి అన్నం ఏమన్నా మిగిలిందేమో అమ్మని అడిగితే - అన్నం ఉంటే ఫర్లేదుకాని. లేకపోతే - నాలుగు రోజులనాడు ఇలాగే అడిగితే "అయ్యో నోరు తెరిచి అడిగాడు బిడ్డ" అంటూ అప్పటికప్పుడు ఏదో చేసి పెట్టింది. కాని ఆవిడను బాధపెట్టడం తన కిష్టంలేదు కాని.... ఆకలి! అబ్బ! అలచు కొంటున్న కొద్దీ మరీ ఎక్కువె పోతోంది అసలు అన్నం మిగిలి వుందేమో చూడాలి. ఇంతకీ అమ్మెక్కడ - పక్కింటావిడతో పెరట్లో కబుర్లు.

చప్పుడు కాకుండా వంటింట్లోకి పోయి. మూతలు తెరిచి చూశాను. ఆహా. చాలా ఉంది. ఇంకేం, ఆవకాయతో లాగించవచ్చు.

"మాదాకవళం తల్లీ. పొద్దుట్నుంచి కూడు నేదమ్మా. నాలుగు మెతుకులెయి తల్లీ" వాకిటి దగ్గర ఎవడో బిచ్చగాడు.

అన్నం చాలా ఉంది. నేను తినా అతనికొక్కంత వేయవచ్చు.

అన్నం గిన్నె మూత చేతిలోంచి జారింది "ఠంగ్".

"అబ్బ! వెధవ పిల్లి మళ్ళీ వచ్చినట్టుందే" పెరట్లోంచి అమ్మ రంగ ప్రవేశం.

"ఏంరా, వంటింట్లో తారట్లాడుతున్నావ్? ఆకలేసిందా ఏమిటి? అన్నం పెట్టమంటావా?"

పెట్టమని సమాధానం ఇచ్చేలోగ బయటనుంచి–

"దొడ్డతల్లీ. పేగు మండిపోతున్నదమ్మా. ఓ పిడికెడు కూడు తల్లీ"

అమ్మ మొహంలో అసహ్యం. "ఛీ! దరిద్రపుగొట్టు వెధవలు. వేళాపాళాలేదు" బయటికి వెళ్ళి ఆ బిచ్చగాడిని వెళ్ళగొట్టి తలుపేసింది.

లోపలికొస్తూ బెడ్‌రూంలోకి పోతున్న నన్నుచూసి అడిగింది" అన్నం పెట్టమంటావా ?"

రెండు క్షణాలు ఆలోచనా రహితంగా గడిపాక అన్నాను.

"వద్దమ్మా!" ●



నరకాసురసంహారము

"చెలిదాకన్ గొనయంబు లాగి విడిచెన్...."

చిత్రం : కె. సింహాచలం, విజయవాడ-10